సాక్షి
ఖమ్మం

సోమవారం । 2 । జనవరి । 2023



నేడు ముక్కోటి ఏకాదశి

జిల్లా వ్యాప్తంగా సోమవారం నిర్వహించే ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు దేవాలయాల్లో ఏర్పాట్లు చేశారు.

8లో



విద్యార్థులకు సువర్ణావకాశం

ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్ చదివిన విద్యార్థులకు పోటీ పరీక్షల నిమిత్తం శిక్షణ ఇవ్వాలని ఉన్నత విద్యాశాఖాధికారులు నిర్ణయించారు.

8లో

గరిష్టం / కనిష్టం
30° / 19°

వాతావరణం

జిల్లాలో సోమవారం పగటి ఉష్ణోగ్రతలు సాధారణంగానే ఉంటాయి. ఉదయం, రాత్రి వేళల్లో కొంత చలి ప్రభావం ఉంటుంది.

కనుల పండువగా..

రామయ్య జలవిహారం..

- భద్రగిరి రామునికి వైభవంగా తెప్పోత్సవం
- భక్త జన సంద్రంగా మారిన గోదావరి తీరం
- పర్యవేక్షించిన కలెక్టర్ అనుదీప్, ఎస్పీ వినీత్





హంసవాహనంలో జలవిహారం చేస్తున్న స్వామి వారు (ఇన్‌సెట్) శ్రీసీతారామచంద్రస్వామి

భద్రాచలం: పండితుల వేద మంత్రోచ్చారణలు, భక్త జనం జయజయ ధ్వానాల నడుమ సీతాలక్ష్మణ సమేతుడైన రామయ్య స్వామి గోదావరిలో జలవిహారం చేశారు. రాములోరి నదీ విహారంతో గోదావరి తల్లి పులకించగా ఈ దృశ్యాలను చూసి భక్తులు ఆనంద పరవశులయ్యారు. భద్రగిరి క్షేత్రం ఆధ్యాత్మిక శోభతో నిండిపోయింది. భద్రాచలం దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైకుంఠ ఏకాదశి ప్రయుక్త అధ్యయనోత్సవాల్లో భాగంగా ఆదివారం సాయంత్రం పవిత్ర గోదావరి నదిలో తెప్పోత్సవం(ప్లవోత్సం) కనుల పండువగా సాగింది.

ఊరేగింపుగా నదీ తీరానికి..

పగల్‌పత్తు ఉత్సవాల్లో భాగంగా ఆదివారం ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపారు. ఉత్సవ మూర్తులకు విశ్వక్సేన పూజ, పుణ్యావాచనం ఇచ్చారు. ఉదయం సేవాకాలం, శ్రీ తిరుమంగై ఆళ్వార్‌లు పరమపదోత్సవం జరిగింది. మధ్యాహ్నం రాజభోగం, శాత్తుమురై, పూర్ణ శరణాగతితో పగల్ పత్తు ముగిసింది. గర్భగుడిలో ప్రభుత్వోత్సవం (దర్బార్ సేవ) నిర్వహించారు. అనంతరం వేదపండితుల మంత్రోచ్చారణలు, మంగళవాయిద్యాలు, భక్తుల జయజయధ్వానాల నడుమ స్వామి వారిని ఊరేగింపుగా తెప్పోత్సవం కోసం ఆలయం నుంచి గోదావరి తీరానికి తీసుకెళ్లారు.

పల్లకిలో గోదావరికి

సాయంత్రం 4గంటలకు ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా గోదావరి తీరానికి సీతారాములు బయల్దేరారు. పల్లకి ముందు కోలాటం ఆడుతూ గోదావరి వైపుగా రాముడితో పాటు భక్తజనులు కదిలివచ్చారు. శ్రీ సీతారామచంద్ర స్వామివారిని చూసి తరించేందుకు దారి పొడవునా బారులుదీరారు. గోదావరి తీరానికి చేరిన తర్వాత అర్చకులు ముందుగా పుణ్య జలాలతో హంసవాహనాన్ని సంప్రోక్షణ చేశారు. ఊరేగింపుగా వచ్చిన స్వామి వారిని హంసవాహనం చెంతకు తీసుకువచ్చారు. అందులో ఏర్పాటు చేసిన పచ్చిపూల మండపంలో తూర్పు ముఖంగా దేవేరులను వేంచేయింప చేశారు. ఈ సందర్భంగా వేదపండితులు చతుర్వేదాలు, నాళాయిర దివ్యప్రబంధం, పంచసూత్రాలు, స్తోత్ర పాఠాలు చదివారు. అనంతరం మంగళహారతి, చక్రపొంగలి నివేదనలో సుమారు గంట పాటు పూజా కార్యక్రమాలు నిర్వహించారు. చివరగా హారతి ఇచ్చి వీఐపీలను దర్శనానికి అనుమతి ఇచ్చారు.



తెప్పోత్సవానికి ముందు ఉత్సవమూర్తులకు హారతి సమర్పిస్తున్న అర్చకులు

ఉత్తర ముఖంగా..

ఆగమ శాస్త్ర పూజాదికాలు పూర్తయిన తర్వాత సాయంత్రం 6 గంటల సమయంలో ఉత్తర ముఖంగా గోదావరి నదిలో హంస వాహనం కదిలింది. నిశ్చలంగా ఉన్న గోదావరి నదిలో విద్యుత్ దీప కాంతులతో ధగధగ మెరుస్తున్న హంస వాహనం, అందులో ఆశీనులైన సీతారాములను చూసేందుకు భక్తులు పోటీ పడ్డారు. తెప్పోత్సవం మొదలైన వెంటనే నదికి ఆవలి తీరంలో బాణసంచా కాల్చడం మొదలైంది. నదిలో హంస వాహన ప్రతిబింబం, ఆకాశంలో బాణసంచాలు వెలువరిస్తున్న రంగురంగుల మెరుపుల మధ్య గోదావరి తీరం ప్రత్యేక శోభ సంతరించుకుంది. కనుల పండువగా రామయ్య జలవిహారం కొనసాగింది. ఒక్కో పరిక్రమణానికి సగటున 12 నిమిషాల సమయం పట్టింది. మొత్తంగా ఐదు పరిక్రమణాలు పూర్తయ్యే సరికి రాత్రి 7:01 గంటలైంది. తెప్పోత్సవం ముగిసిన అనంతరం ఆగమ శాస్త్ర పద్ధతులు అనుసరిస్తూ సీతారాములను తిరిగి ఆలయానికి తీసుకొచ్చారు.

కట్టుదిట్టమైన భద్రత

తెప్పోత్సవాన్ని కలెక్టర్ అనుదీప్ భద్రాచలంలోనే ఉండి పర్యవేక్షించారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా ఎస్పీ వినీత్, ఏఎస్పీ రోహిత్ రాజ్ పర్యవేక్షించి సిబ్బందికి దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమాల్లో భద్రాచలం ఎమ్మెల్యే పొదెం వీరయ్య, అడిషనల్ కలెక్టర్ కె.వెంకటేశ్వర్లు, ఆపరేషన్స్ ఓఎస్డీ సాయిమనోహర్, భద్రాచలం ఆర్డీఓ రత్న కల్యాణి, ఆలయ ఈఓ శివాజీ, ఏఈఓ శ్రవణ్‌కుమార్, తహసీల్దార్ శ్రీనివాస్ యాదవ్, అర్చకులు, వేదపండితులు, భక్తులు పాల్గొన్నారు.



ఆకట్టుకున్న కోలాటం

ఆలయంలో ప్రత్యేకపూజలు అందుకున్న స్వామి వారు సాయంత్రం 4గంటలకు ప్రత్యేక పల్లకిపై ఊరేగింపుగా గోదావరి తీరానికి బయలుదేరారు. తెప్పోత్సవానికి పల్లకిలో స్వామి వారు వెళ్లే సమయంలో పల్లకి ముందు వివిధ సంస్థల ఆధ్వర్యంలో మహిళలు చేసిన కోలాట ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. పురుషోత్తపల్లి నుంచి వచ్చిన మహిళల బృందం చేసిన డప్పు నృత్యం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.



భద్రాచలం వద్ద గోదావరిలో నిర్వహించిన తెప్పోత్సవాన్ని తిలకిస్తున్న భక్తులు

న్యూస్‌రీల్

ముగిసిన క్రీడలు

నేలకొండపల్లి: మండలంలోని చెరువుమాధారంలో నూతన సంవత్సరం సందర్భంగా నిర్వహించిన పలు పోటీలు ఆదివారం ముగిశాయి. గ్రామ యూత్ ఆధ్వర్యంలో ముగ్గులు, కబడ్డీ, ఎడ్లుల ప్రదర్శన పోటీలు నిర్వహించారు. మూడు రోజులపాటు ఖమ్మం–సూర్యాపేట జిల్లాల స్థాయిలో నిర్వహించిన కబడ్డీ పోటీలకు విశేష స్పందన లభించింది. మొత్తం 32 జట్లు తలపడ్డాయి. తిరుమలాయపాలెం మండలంలోని బచ్చోడుతండా జట్టు విజేతగా నిలిచింది. రెండో బహుమతిని కోదాడ గోల్డెన్ స్పోర్ట్స్ క్లబ్ దక్కించుకుంది. చెరువుమాధారం జట్టు మూడో స్థానం, సూర్యాపేట జిల్లా మోతె మండలం సిరికొండ జట్టు నాలుగో స్థానంలో నిలిచాయి. ఎడ్ల పరుగు పందెంలో గ్రామానికి చెందిన సుందరయ్య జత ప్రథమ స్థానం, సూరేపల్లి దానయ్య జత రెండో స్థానం, నూకతోటి కొండయ్య జత మూడో స్థానంలో నిలిచాయి. ఎడ్ల బలప్రదర్శనలో సూరేపల్లి దానయ్యకు చెందిన జత ప్రథమ, కె.సుందరయ్య జత రెండో స్థానం, నూకతోటి కొండయ్య జత మూడో స్థానంలో నిలిచాయి. ముగ్గుల పోటీల్లో స్రవంతి (ప్రథమ), మౌనిక (రెండు), కవిత (మూడు), పి.హర్షిణి (నాలుగు), నూకతోటి రాణి (ఐదు) వరుసగా బహుమతులు గెలుచుకున్నారు. అనంతరం విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.

కరాటే విజేతకు కలెక్టర్ అభినందన



కోమలిని అభినందిస్తున్న కలెక్టర్ గౌతమ్

సత్తుపల్లిరూరల్: తమిళనాడు రాష్ట్రంలోని కోయంబత్తూరులో ఇటీవల జరిగిన జాతీయ స్థాయి కరాటే పోటీల్లో స్వర్ణపతకం గెలుచుకున్న సత్తుపల్లి బుడోఖాన్ కరాటే క్లబ్ విద్యార్థి జె.కోమలిని కలెక్టర్ వీపీ గౌతమ్ అభినందించారు. నూతన సంవత్సర వేడుకల సందర్భంగా ఆదివారం క్యాంప్ కార్యాలయంలో కలిసిన కోమలికి సర్టిఫికెట్ అందించి ప్రశంసించారు.

శ్రీవారిని దర్శించుకున్న ఎమ్మెల్యే సండ్ర దంపతులు



తిరుమలలో ఎమ్మెల్యే సండ్ర దంపతులు

సత్తుపల్లి: కలియుగ ప్రత్యక్షదైవం శ్రీ వేంకటేశ్వర స్వామిని సత్తుపల్లి ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య, ఆయన సతీమణి మహాలక్ష్మి ఆదివారం దర్శించుకున్నారు. టీటీడీ దేవస్థానం వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించి, స్వామివారి తీర్థ ప్రసాదాలను ఎమ్మెల్యే దంపతులకు అందజేశారు.

శ్రీకనకదుర్గమ్మతల్లికి విశేష పూజలు

పాల్వంచరూరల్: మండల పరిధిలోని కేశవాపురం, జగన్నాథపురం గ్రామాల మధ్య కొలువై ఉన్న శ్రీకనకదుర్గ(పెద్దమ్మతల్లి)ఆలయానికి ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా వివిధ ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. ఉదయం నుంచి సాయంత్రం వరకు భక్తులు క్యూలైన్ ద్వారా వెళ్లి అమ్మవారిని దర్శించుకున్నారు. పూజలు నిర్వహించి తలనీలాలు సమర్పించారు. ఒడి బియ్యం, చీరలు, కుంకుమ, పసుపు, గాజులు సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈఓ ఎస్.రజనీకుమారి పూజా కార్యక్రమాలను పర్యవేక్షించారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయం



'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో స్థానికుల సమస్యలు తెలుసుకుంటున్న మంత్రి పువ్వాడ అజయ్

- రూ.1200 కోట్లతో నగరాభివృద్ధికి చర్యలు చేపట్టా
- సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరుస్తున్నా
- 'వాడవాడకు పువ్వాడ' కార్యక్రమంలో మంత్రి అజయ్‌కుమార్

ఖమ్మంమయూరిసెంటర్ : గడపగడపకూ వెళ్లి ప్రజల సమస్యలు తెలుసుకుని, వాటిని అక్కడికక్కడే పరిష్కరించడమే ధ్యేయంగా వాడవాడ పువ్వాడ కార్యక్రమానికి శ్రీకారం చుట్టినట్లు రాష్ట్ర రవాణ శాఖ మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ అన్నారు. నగరంలోని 17, 27వ డివిజన్లలో ఆదివారం వాడవాడకు పువ్వాడ కార్యక్రమాన్ని మంత్రి ప్రారంభించారు. ఇంటింటికీ వెళ్లి ప్రజలను నేరుగా కలుసుకుని వారి సమస్యలు తెలుసుకున్నారు. భారీ జన సందోహం మధ్య ప్రారంభమైన ఈ కార్యక్రమానికి స్థానిక మహిళలు పూలు, హారతులతో స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మంత్రి పువ్వాడ మాట్లాడుతూ.. వాడ వాడ పువ్వాడ కార్యక్రమం ప్రజలలో నుండి వచ్చిన నినాదమని, అదే పేరుతో ప్రజల వద్దకు వెళ్లాలని నిర్ణయించామని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు పూర్తి స్థాయిలో అందుతున్నాయా లేదా అని స్వయంగా పర్యవేక్షించే అవకాశం కలిగిందన్నారు. ఒకప్పుడు మురికి కాల్వలుగా ఉన్న ప్రదేశాలు నేడు పార్కులుగా మార్చగలిగామన్నారు. ఇరుకుగా ఉన్న ప్రధాన రహదారులను విస్తరించి సెంట్రల్ లైటింగ్‌ను ఏర్పాటు చేశామని, రోడ్లు, కాల్వలు, లైటింగ్, గ్రీనరీ ఇలా అనేక విధాలుగా నగరాన్ని తీర్చిదిద్దామని అన్నారు. హైదరాబాద్ తరువాత ఐటీకి బీజం వేసింది ఖమ్మంలోనేనని అన్నారు. తాను మంత్రి అయిన నాటి నుంచి కేవలం ఖమ్మం అభివృద్ధి, సంక్షేమమే ధ్యేయంగా పని చేశానని, దాని ఫలితం నేడు చూస్తున్నామని, ఒకప్పటి ఖమ్మాన్ని.. నేడు సరిచూస్తే గుర్తుపట్టలేనంతగా మారిపోయిందని అన్నారు. దాదాపు రూ.1200 కోట్లతో నగర అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. కొత్త బస్టాండ్, కొత్త మున్సిపల్ కార్పొరేషన్, సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయం, ఫ్లైఓవర్లు, రహదారి విస్తరణ వంటి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. కార్పొరేషన్ పరిధిలో దాదాపు రూ.30 కోట్లతో ఒక్కో డివిజన్‌కు రూ. 45 లక్షలు కేటాయించి 42 కిలో మీటర్ల నిడివి గల సైడ్ కాల్వల నిర్మాణం చేపడుతున్నామని తెలిపారు. 9 సంవత్సరాల్లో 10 వేలకు పైగా మందికి ఇళ్ల పట్టాలు అందించామన్నారు. ఖమ్మం నగరంలో ప్రస్తుతం ఉన్న వాటికి అదనంగా దాదాపు 35 వేల నూతన నల్లా కనెక్షన్లు ఇచ్చామన్నారు. నగరంలో 30వేల మందికి వివిధ రకాల ఆసరా పెన్షన్లు ఇస్తున్నామని, కల్యాణలక్ష్మి, షాదీ ముబారక్ పథకం ద్వారా రూ.75 కోట్లు పంపిణీ చేశామని వెల్లడించారు. లబ్ధిదారుల ఇళ్లకే వెళ్లి చెక్కులు పంపిణీ చేయడంతో, అది చూసి రాష్ట్రంలోని ఇతర నియోజకవర్గాల్లోనూ ఆయా ఎమ్మెల్యేలు అనుసరిస్తున్నారని గుర్తు చేశారు. రాష్ట్రంలో అత్యధికంగా ఖమ్మం నియోజకవర్గంలోనే 2 వేల డబుల్ బెడ్ రూమ్ ఇళ్లు లబ్ధిదారులకు అందజేసినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ ఆదర్శ్ సురభి, మేయర్ పునుకొల్లు నీరజ, డీసీసీబీ చైర్మన్ కూరాకుల నాగభూషణం, సుడా చైర్మన్ విజయ్ కుమార్, డిప్యూటీ మేయర్ ఫాతిమా జోహరా, ఖమ్మం ఆర్డీవో రవీంద్రనాథ్, అర్బన్ తహసీల్దార్ శైలజ తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు శుభాకాంక్షల వెల్లువ



కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న గెజిటెడ్ అధికారుల సంఘం నాయకులు



బాలల సదనం పిల్లలతో కలెక్టర్ కుమార్తె

ఖమ్మం సహకారనగర్: నూతన సంవత్సరం సందర్భంగా కలెక్టర్ వీపీ గౌతమ్‌కు ఆదివారం శుభాకాంక్షలు వెల్లువెత్తాయి. కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగ సంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాలు, నోట్ పుస్తకాలు అందించి శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌ను కలిసిన వారిలో జిల్లా పరిషత్ చైర్మన్ లింగాల కమల్‌రాజ్, డీసీఎంఎస్ చైర్మన్ రాయల శేషగిరిరావు, జిల్లా అదనపు కలెక్టర్లు స్నేహలత మొగిలి, ఎన్.మధుసూధన్, అసిస్టెంట్ కలెక్టర్ రాధిక గుప్తా, జెడ్పీ సీఈఓ వి.వి. అప్పారావు, డీఆర్‌డీఓ విద్యాచందన, జిల్లా ఉపాధి కల్పనాధికారి కొండపల్లి శ్రీరామ్, తెలంగాణ రెవెన్యూ ఎంప్లాయిస్ సర్వీసెస్ అసోసియేషన్(ట్రెసా), తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం, గ్యాస్ డీలర్ల సంఘం, రేషన్ డీలర్ల సంఘం నాయకులు ఉన్నారు.

బాలల సదనంలో కలెక్టర్ కుమార్తె ఇనియా

కలెక్టర్ వీపీ గౌతమ్ క్యాంపులో జరిగిన నూతన సంవత్సర వేడుకలకు బాలల సదనంలోని బాలలు సైతం హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ కుమార్తె ఇనియా బాలలతో కలిసి ముచ్చటించింది. అనంతరం నూతన సంవత్సరం శుభాకాంక్షలు తెలుపుకున్నారు.

శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు



శ్రీవారి దర్శనం కోసం బారులుదీరిన భక్తులు

- జమలాపురం ఆలయానికి 25వేల మంది రాక..
- ఒక్కరోజే రూ. 5.01లక్షల ఆదాయం

ఎర్రుపాలెం: తెలంగాణా తిరుపతిగా ప్రసిద్ధి గాంచిన జమలాపురం శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయానికి ఆదివారం నూతన సంవత్సరం సందర్భంగా భక్తులు పోటెత్తారు. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు చెందిన 25వేల మంది భక్తులు స్వామివారిని దర్శనం చేసుకున్నారు. దీంతో ఆలయ ప్రాంగణం కిటకిటలాడింది. గోవింద నామస్మరణతో ప్రాంగణం మార్మోగింది. శ్రీవేంకటేశ్వర స్వామి, శ్రీ అలివేలు మంగమ్మ అమ్మవారిని, శ్రీపద్మావతి అమ్మవారిని, ఉపాలయాల్లో కొలువైన శ్రీసోమేశ్వరస్వామి వారి, శ్రీగణపతి, శ్రీఆంజనేయ స్వామి, శ్రీఅయ్యప్పస్వామి వారి ఆలయాలను భక్తులు దర్శించుకున్నారు. కాగా, వేంకటేశ్వరస్వామి ఆలయానికి లడ్డూలు, వాహన పూజలు, తలనీలాల టికెట్ల ద్వారా ఒక్కరోజే రూ.5.01 లక్షల ఆదాయం వచ్చింది. జమలాపురానికి చెందిన తుళ్లూరి కోటేశ్వరరావు – నిర్మల దంపతులు భక్తులకు పులిహోర ప్రసాదాన్ని వితరణ చేయగా మధిర మండలం ఖమ్మంపాడుకు చెందిన దొండపాటి పూర్ణచంద్రరావు–ప్రభావతి దంపతులు అన్నదాన చేశారు. భక్తులకు ఎటువంటి ఇబ్బందులు తలెత్తకుండా స్థానిక శ్రీవేంకటేశ్వర సేవా సమితి సభ్యులు, మధిర పట్టణానికి చెందిన సత్యసాయి సేవా సమితి కమిటీకి చెందిన 200 మంది సభ్యులు సేవలందించారు. ఆలయ ఈఓ కె జగన్మోహన్ రావు, చైర్మన్ ఉప్పల కృష్ణమోహన్ భక్తులకు ఇబ్బంది తలెత్తకుండా తగిన వసతులు కల్పించారు. కార్యక్రమంలో ప్రధాన అర్చకులు ఉప్పల శ్రీనివాసశర్మ, సూపరెంటెండెంట్ శ్రీనివాస్, సీనియర్ అసిస్టెంట్ విజయకుమారి పాల్గొన్నారు.

ప్రజల కోరిక నెరవేరుస్తా..

- రాబోయే ఎన్నికల్లో పోటీకి సిద్ధం
- సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలూ వెల్లడిస్తా
- నూతన సంవత్సర వేడుకల్లో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



పొంగులేటిని గజమాలతో సత్కరిస్తున్న నాయకులు, అభిమానులు

ఖమ్మంమయూరిసెంటర్: వచ్చే అసెంబ్లీ ఎన్నికల బరిలోకి దిగేందుకు శీనన్న టీం సిద్ధంగా ఉందని.. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలను త్వరలోనే వెల్లడిస్తానని.. ప్రజాహితమే అభిమతంగా భావించే తాను.. తప్పకుండా వారి కోరిక నేరవేరుస్తానని ఖమ్మం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. ఖమ్మంలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఆదివారం జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో అభిమానులు, నాయకులతో ఆయన మాట్లాడారు. ఉమ్మడి జిల్లాలోని పది నియోజకవర్గాల నుంచి పెద్ద ఎత్తున వచ్చిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు. ప్రజాప్రతినిధిగా అర్హత గల తన అనుచరులంతా వచ్చే ఎన్నికల్లో పోటీచేస్తారని ప్రకటించారు. గత నాలుగున్నరేళ్లలో ఏం ఇబ్బంది జరిగింది.. ఎందుకు జరిగిందనేది తెలియంది కాదన్నారు. నేడు బీఆర్ఎస్ పార్టీలో ఉన్నామని, ఈ పార్టీలో మనకున్న గౌరవం ఏంటి ? భవిష్యత్తులో ఉండబోయే గౌరవం ఏంటనేది అభిమానులు, ప్రజలు, అనుచర నాయకులు ఆలోచించాలని కోరారు. ప్రజల ప్రేమ, అభిమానాలు పొందిన ప్రతి నాయకుడు ప్రజాప్రతినిధి కావాలని, అప్పుడే ప్రజలకు మంచి జరుగుతుందని అన్నారు. ఇది రాజకీయ వేదిక కాదని, సమయం వచ్చినప్పుడు అన్ని విషయాలు చర్చిస్తానన్నారు.

భవిష్యత్తులో మీ ముందుకొస్తా.. ఆదరించండి

వైరా రూరల్: 'భవిష్యత్తులో మీ శ్రీనన్న వచ్చినా.. నా తరఫు మనిషి వచ్చినా ఆదరించాల'ని పొంగులేటి శ్రీనివాసరెడ్డి కోరారు. మండలంలోని కేజీ సిరిపురంలో ఆదివారం జరిగిన చర్చి వార్షికోత్సవానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. 2014 ఎన్నికల్లో ప్రజాభిమానం, దేవుడి కృపతో ఖమ్మం ఎంపీగా గెలుపొందానని, గత నాలుగేళ్లుగా ఎలాంటి పదవి లేకున్నా జిల్లా ప్రజలు తనను గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నారని తెలిపారు. అనంతరం క్రైస్తవులకు క్రిస్మస్, నూతన సంవత్సర శుభాకాంక్షలు తెలిపి ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. కార్యక్రమంలో మార్క్‌ఫెడ్ రాష్ట్ర వైస్ చైర్మన్ బొర్రా రాజశేఖర్, వైరా మున్సిపల్ చైర్మన్ సూతకాని జైపాల్, నాయకులు మోరంపూడి బాబు, మిట్టపల్లి నాగి, మచ్చా వెంకటేశ్వర్లు, మట్టూరి నాగేశ్వరరావు, సాగినేని నాగేశ్వరరావు(నాగు), పాస్టర్లు తడికమళ్ల మధు, ఇనుపనూరి వీరయ్య, ముత్తయ్య తదితరులు పాల్గొన్నారు.

నేడు ముక్కోటి



కమాన్‌బజార్‌లోని శ్రీవేంకటేశ్వరస్వామి వారి ఆలయం

- వైష్ణవాలయాల్లో ఉత్తర ద్వార దర్శనం
- ఏర్పాట్లు పూర్తి

ఖమ్మంగాంధీచౌక్: ముక్కోటి ఏకాదశి ఉత్సవాలకు దేవాలయాల్లో ఏర్పాట్లు చేశారు. ధనుర్మాసోత్స వాల్లో ముక్కోటి ఏకాదశికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. జిల్లావ్యాప్తంగా సోమవారం నిర్వహించే ఈ ముక్కోటి వేడుకలకు ప్రధానంగా వైష్ణవ ఆలయాలు సిద్ధమయ్యాయి. సూర్యుడు ఉత్తరాయణానికి మారే ముందు వచ్చే ధనుర్మాస శుద్ధ ఏకాదశినే వైకుంఠ ఏకాదశి లేదా ముక్కోటి అని పిలుచుకోవటం తెలిసిందే. సూర్యుడు ధనుస్సులో ప్రవేశించిన అనంతరం మకర సంక్రమణ వరకు జరిగే మార్గ మధ్య ముక్కోటి ఏకాదశి వస్తుంది. ఈ రోజున వైకుంఠ వాకిళ్లు తెరుచుకొని ఉంటాయని భావించి వైష్ణవాలయాల్లో గల ఉత్తర ద్వారం వద్ద భక్తులు తెల్లవారుజామునే భగవంతుడి దర్శనం కోసం వేచి ఉంటారు. ఈ రోజున మహా విష్ణువు గరుడ వాహనధారుడై మూడుకోట్ల దేవతలతో భూలోకానికి వచ్చి భక్తులకు దర్శనమిస్తాడని పురాణాలు చెబుతున్నాయి. ఈ ఒక్క ఏకాదశి మూడు కోట్ల ఏకాదశులతో సమానమని, ఈ పవిత్రతను గుర్తించి ఈ ఏకాదశిని ముక్కోటి ఏకాదశిగా జరుపుకుంటారు.

వైష్ణవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు

ముక్కోటి వేడుకలకు జిల్లాలోని వైష్ణవ దేవాలయాల్లో ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. తెల్లవారుజాము నుంచే భక్తులు ఆలయాలకు వెళ్లి ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునే విధంగా ఏర్పాట్లు చేశారు. ముక్కోటి రోజున భక్తులు ఉపవాసాలు, జాగాహరణలు ఉండి స్వామి వారిని దర్శించుకుంటారు. ఈ సందర్భంగా ఆలయాల్లో అర్చకులు, పండితులు, హోమాలు, ప్రవచనాలు జరిపే విధంగా ఏర్పాట్లు చేశారు. ఉత్తర ద్వారం ద్వారా స్వామి వారిని దర్శించుకునేందుకు జిల్లాలోని పలు దేవాలయాలకు పెద్ద సంఖ్యలో భక్తులు వచ్చే అవకాశం ఉండటంతో, ఆయా ఆలయాల్లో నిర్వహణ కమిటీలు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. పలు ఆలయాల్లో బారికేడ్లను కూడా ఏర్పాటు చేశారు. ఖమ్మం నగరంలోని కమాన్‌బజార్‌లో ఉన్న శ్రీవేంకటేశ్వరస్వామి దేవస్థానంలో ముక్కోటి వేడుకలు ప్రత్యేకంగా జరుపుతారు. ఈ ఆలయానికి భక్తులు పెద్ద సంఖ్యలో హాజరవుతారు. స్వామి వారి దర్శనానికి కమాన్ బజార్ రహదారుల వరకు కూడా క్యూలైన్లు ఉంటాయి. నగరంలోని మరో ఆలయం త్రీటౌన్‌లోని హర్కారాబావి సెంటర్ సమీపంలోని రంగనాయకుల గుట్టపై ఉన్న శ్రీలక్ష్మీరంగనాథస్వామి దేవాలయం. ఇక్కడ కూడా ధనుర్మాస ఉత్సవాలను ప్రత్యేకంగా జరుపుతారు. ఈ ఉత్సవాల్లో భాగంగా ముక్కోటి దర్శనాన్ని ప్రత్యేకంగా నిర్వహిస్తారు. ఇక నగరంలోని కస్బాబజార్‌లోని రామాలయం, ఎన్ఎస్‌పీరోడ్‌లోని రామాలయంలలో ముక్కోటి వేడుకలకు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

తులసి మాలలకు డిమాండ్

ముక్కోటి అనగానే స్వామి వారిని ఉత్తర ద్వారం ద్వారా దర్శించుకొని తులసి మాలలను సమర్పించటం ప్రత్యేకం. అందుకోసం వైష్ణవ ఆలయాల వద్ద తులసి మాలలకు డిమాండ్ ఉంటుంది. ఈ సందర్భంగా ఆలయాల వద్ద తులసి మాలలను ప్రత్యేకంగా విక్రయిస్తుంటారు. ముక్కోటి రోజున తులసి మాలను భగవతునికి సమర్పిస్తే ఎంతో పుణ్యఫలమని భక్తుల విశ్వాసం.



శ్రీలక్ష్మీ రంగనాథస్వామి ఆలయం

విద్యార్థులకు సువర్ణావకాశం

- ప్రభుత్వ కళాశాలల్లో పోటీ పరీక్షల శిక్షణ
- నేటి నుంచి ఎంసెట్ తరగతులు
- పుస్తకాలు అందజేయనున్న ఉన్నత విద్యాశాఖ
- నిధులు కేటాయించిన కలెక్టర్ వీపీ గౌతమ్

ఖమ్మంసహకారనగర్: ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ అభ్యసించిన విద్యార్థులకు పోటీ పరీక్షల నిమిత్తం శిక్షణ ఇవ్వాలని ఉన్నత విద్యాశాఖాధికారులు నిర్ణయించారు. కార్పొరేట్ కళాశాలలకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో విద్యను అభ్యసించే విద్యార్థులకు కూడా తగిన అవకాశాలు కల్పించాలనే సంకల్పంతో విద్యార్థులకు ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్‌కు సంబంధించి లెక్చరర్లతో ప్రత్యేక శిక్షణ ఇప్పించనున్నారు. అందుకోసం విద్యాశాఖ తగిన ఏర్పాట్లు చేస్తోంది. జిల్లా ఇంటర్మీడియట్ విద్యాశాఖాధికారి ఇందుకు సంబంధించి ఇప్పటికే కార్యాచరణ రూపొందించారు. నేటి(సోమవారం) నుంచి ఈ శిక్షణ తరగతులను ప్రారంభించనున్నారు.

విద్యార్థుల ఇబ్బందులు తప్పేలా..

కార్పొరేట్ కళాశాలల్లో విద్యనభ్యసిస్తున్న వారికి పోటీ పరీక్షలను రాసేందుకు మంచి శిక్షణను ఇస్తున్నారు. అయితే ప్రభుత్వ కళాశాలల్లో ఇంటర్మీడియట్ పూర్తి చేసిన అనంతరం ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ వాటికి ఎంట్రన్స్ పరీక్షలు రాయాలంటే మళ్లీ కోచింగ్ సెంటర్లను ఆశ్రయించాల్సిన పరిస్థితులు ఏర్పడుతున్నాయి. అక్కడ అధిక ఫీజులు చెల్లించలేని విద్యార్థులు తూతూ మంత్రంగా పరీక్షలకు హాజరై తక్కువ ర్యాంకులు సాధించడం లేనిపక్షంలో ఇంటర్ తర్వాత డిగ్రీల్లో చేరడం వంటివి జరుగుతున్నాయి. ఇలా విద్యార్థుల బంగారు భవిష్యత్తు నాశనం కాకూడదనే ఉద్దేశంతో విద్యార్థులకు ప్రత్యేక సమయంలో ఈ శిక్షణను ఇవ్వాలని విద్యాశాఖ అధికారులు నిర్ణయం తీసుకున్నారు.

ప్రభుత్వం నుంచే పుస్తకాలు..

ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ ఎంట్రన్స్ పరీక్షలకు సన్నద్ధం అయ్యేందుకు అవసరమైన పుస్తకాలను కూడా విద్యార్థులు కొనుగోలు చేయాల్సిన అవసరం లేదు. ఈ పుస్తకాలను ఉన్నత విద్యాశాఖ కమిషనర్ కార్యాలయం జిల్లాకు పంపనుంది. విద్యార్థుల సంఖ్యను బట్టి త్వరలోనే ఈ పుస్తకాలు కూడా ఆయా కళాశాలలకు రానున్నాయి. ఒకటి నుంచి తరగతులు ప్రారంభం కానున్న నేపథ్యంలో వీలైనంత త్వరగా పుస్తకాలను పంపేందుకు విద్యాశాఖ కసరత్తు చేస్తోంది. ఇలాగే ప్రత్యేకంగా పోటీ పరీక్షలకు విద్యార్థులకు శిక్షణ నిమిత్తం జిల్లా కలెక్టర్ వీపీ గౌతమ్ రూ.10.94 లక్షలను విడుదల చేశారు.

నేటి నుంచి షురూ..

జనవరి రెండో తేదీ నుంచి జిల్లాలోని 19 జూనియర్ కళాశాలల్లో ఈ కోచింగ్‌ను ప్రారంభించనున్నారు. ఆయా కళాశాలల్లో ఉన్న లెక్చరర్లు ఈ సబ్జెక్టులను బోధిస్తారు. మే నెలలో ఎంసెట్, నీట్, జేఈఈ మెయిన్స్ తదితర పోటీ పరీక్షలు ఉన్న నేపథ్యంలో పూర్తిస్థాయిలో విద్యార్థులు సన్నద్ధం కావాలనే ఉద్దేశంతో ఈ పరీక్షలకు శిక్షణ ముందు నుంచే ప్రారంభిస్తున్నారు. కళాశాల సమయంలో కాకుండా కోచింగ్ కోసం ప్రత్యేక సమయాన్ని కేటాయించారు. ముఖ్యంగా కోచింగ్ తీసుకోలేని పేద విద్యార్థులకు ఈ నిర్ణయం ఎంతగానో ఉపయోగపడుతుందని విద్యాశాఖ భావిస్తోంది.

ఈ నిధులతో అదనంగా అవసరమైన పుస్తకాలతోపాటు ఇతర అవసరాలకు వినియోగించనున్నారు. మొత్తం మీద విద్యార్థులకు ఇది ఒక సువర్ణ అవకాశంగా అభివర్ణించవచ్చు. విద్యార్థుల తల్లిదండ్రులు ఈ నిర్ణయం పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు.

కోచింగ్ అనంతరం స్క్రీనింగ్ టెస్ట్..

జిల్లాలోని 19 కళాశాలల్లో ఉన్న 952 మంది విద్యార్థులకు జనవరి ఒకటో తేదీ నుంచి రెండు నెలల పాటు కోచింగ్ ఇవ్వనున్నారు. ఆ తర్వాత వీరికి స్క్రీనింగ్ టెస్ట్ నిర్వహిస్తారు. ఈ స్క్రీనింగ్ టెస్ట్‌లో ప్రతిభ చూపిన 50 మంది బాలురు, 50 మంది బాలికలను ఎంపిక చేస్తారు. వీరికి విడివిడిగా రెసిడెన్షియల్ కళాశాలల్లో ఒకటిన్నర నెలల వరకు కోచింగ్ ఇస్తారు. దీని వల్ల మంచి ప్రతిభ ఉన్న విద్యార్థులు మంచి ర్యాంకులు సాధించేందుకు అవకాశాలు మెరుగవుతాయి.

విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం కార్పొరేట్ విద్యకు దీటుగా ప్రభుత్వ కళాశాలల్లో సైతం పోటీ పరీక్షలకు శిక్షణ ఇవ్వాలని నిర్ణయించింది. ప్రభుత్వ ఆదేశాల మేరకు జనవరి రెండో తేదీ నుంచి జిల్లాలోని 19 ప్రభుత్వ జూనియర్ కళాశాలల్లో పోటీ పరీక్షలకు శిక్షణ తరగతులు నిర్వహించనున్నాం. పేద విద్యార్థులకు ఇది ఉపయోగకరంగా ఉంటుంది. ఈ అవకాశాన్ని వినియోగించుకుని విద్యార్థులు ఉన్నత స్థాయికి ఎదగాలి.

– కె.రవిబాబు, జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి, ఖమ్మం

క్లుప్తంగా

బైక్‌ను ఢీకొట్టిన టిప్పర్

నేలకొండపల్లి: అధిక లోడుతో వస్తున్న టిప్పర్లు.. మట్టిని తరలిస్తున్న తరుణంలో ప్రమాదం జరిగింది. బైక్‌పై వస్తున్న ముగ్గురికి గాయాలయ్యాయి. తృటిలో పెనుప్రమాదం తప్పింది. స్థానికుల కథనం ప్రకారం.. మండలంలోని అనాసాగారం గ్రామానికి చెందిన బొడ్డు కిరణ్ కుటుంబ సభ్యులతో కలిసి గురుకుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న తన కూతురు హేమశ్రీని చూసేందుకు ఆదివారం బైక్‌పై వస్తున్నారు. మార్గమధ్యలో జాతీయ రహదారి పనులలో భాగంగా కోనాయిగూడెం సమీపంలో నుంచి మట్టిని తరలిస్తున్న టిప్పర్ ఢీ కొట్టింది. దీంతో కిరణ్‌కు తీవ్ర గాయాలు కాగా, భార్య కవిత, కుమారుడు హర్షిత్‌కు స్వల్ప గాయాలయ్యాయి. తృటిలో పెనుప్రమాదం తప్పింది. ముగ్గురు కూడా టిప్పర్ కింద పడకుండా క్షణాల్లో తప్పించుకున్నారు. స్థానికులు స్పందించి వారిని స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. అనంతరం 108 ద్వారా మెరుగైన వైద్యం కోసం ఖమ్మం తరలించారు.

ఈవెంట్‌లో సెలెక్ట్.. ప్రమాదంలో మృతి



తుట్టి శ్రీకాంత్ మృతదేహం

సత్తుపల్లిటౌన్: పోలీస్ ఉద్యోగాల దేహదారుఢ్య పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన ఓ యువకుడు ప్రమాదవశాత్తు భవనం పైనుంచి పడి మృతి చెందిన ఘటన శనివారం అర్ధరాత్రి సత్తుపల్లిలో చోటు చేసుకుంది. అశ్వారావుపేట మండలం ఊసుర్లగూడెం గ్రామానికి చెందిన తుట్టి శ్రీకాంత్ (25) సత్తుపల్లిలో ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్నాడు. స్థానిక ఓ అపార్ట్‌మెంట్‌లో పైఅంతస్తులో అద్దెకు ఉంటున్నాడు. శనివారం అర్ధరాత్రి నిద్రమత్తులో బాత్‌రూమ్‌కు వెళ్తూ అపార్ట్‌మెంట్‌లో పిట్టగోడ ఎత్తు తక్కువగా ఉండటంతో ప్రమాదవశాత్తు జారి కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఆదివారం ఉదయం వాచ్‌మెన్ గమనించి పోలీసులకు సమాచారం అందించాడు. మృతుడు ఇటీవల ఖమ్మంలో నిర్వహించిన పోలీస్ ఈవెంట్‌లో ఎంపికైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. తండ్రిలేని కుటుంబానికి ఆసరాగా ఉంటాడనుకున్న కొడుకు శ్రీకాంత్ మృతితో తల్లి వాణి రోదనలు మిన్నంటాయి. స్థానిక ప్రభుత్వాస్పత్రిలో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఎస్‌ఐ రాము కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రైలు ఢీకొని కీమెన్ మృతి



రాజేందర్ (ఫైల్)

చింతకాని: మండలంలోని పందిళ్లపల్లి రైల్వేస్టేషన్ సమీపంలో శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలు ఢీకొని రైల్వే కీమేన్ మాలోతు రాజేందర్ (34) ఆదివారం మృతి చెందాడు. రైల్వే పోలీసుల కథనం ప్రకారం.. పందిళ్లపల్లి సెక్టార్‌లో కీమేన్‌గా విధులు నిర్వర్తిస్తున్న రాజేందర్ ఎగువ లైనులో రైలు పట్టాలను తనిఖీ చేస్తున్నాడు. ఆ సమయంలో విజయవాడ వైపు నుంచి ఖమ్మం వైపు వెళ్తున్న శాతవాహన ఎక్స్‌ప్రెస్ రైలును పొగమంచు తీవ్రతలో గుర్తించలేదు. దీంతో రైలు రాజేందర్‌ను ఢీకొట్టడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలాన్ని సందర్శించిన రైల్వే పోలీసులు మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఖమ్మం ప్రభుత్వాస్పత్రికి తరలించారు. రాజేందర్ స్వగ్రామం కామేపల్లి మండలం బర్లగూడెం. మృతుడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. రైల్వే ఎస్‌ఐ భాస్కర్‌రావు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ఆర్టీసీ బస్సు అద్దాలు పగలగొట్టిన ఆకతాయిలు

ఖమ్మంరూరల్: మండలంలోని ఎం.వెంకటాయపాలెం వద్ద కొందరు ఆకతాయిలు మహబూబాబాద్ నుంచి ఖమ్మం వస్తున్న ఆర్టీసీ బస్సును శనివారం ఆపి బస్సు అద్దాలు పగలగొట్టారు. కొందరు గుర్తు తెలియని యువకులు మద్యం సేవించి అటుగా వస్తున్న బస్సును ఆపి అద్దాలు పగలగొట్టారు. దీంతో బస్సులో ఉన్న ప్రయాణికులు, బస్సు సిబ్బంది వారిని అడ్డుకున్నారు. దీంతో సదరు యువకులు అక్కడి నుంచి పారిపోయారు.

డివైడర్‌ను ఢీకొని ఎలక్ట్రీషియన్ దుర్మరణం

పాల్వంచ: నూతన సంవత్సరం ఆ కుటుంబంలో విషాదం నింపింది. ఓ వైపు నూతన సంబరాలు జరుగుతుండగా మోటార్ సైకిల్‌పై వెళ్తున్న ఎలక్ట్రీషియన్ ప్రమాదవశాత్తు డివైడర్‌ను ఢీకొని దుర్మరణం చెందాడు. పోలీసుల కథనం ప్రకారం వివరాలిలా ఉన్నాయి. పట్టణంలోని ప్రశాంత్‌నగర్ కాలనీకి చెందిన రాపోలు రమేష్(42) ఎలక్ట్రీషియన్‌గా పనిచేస్తున్నాడు. శనివారం అర్ధరాత్రి 12.40 గంటలకు ద్విచక్ర వాహనంపై పెద్దమ్మగుడికి వైపు పనికి వెళ్లి తిరిగి వస్తున్న క్రమంలో రెజీనా స్కూల్ వద్ద రోడ్డు వంపులుగా ఉండటంతో బండి స్కిడ్ అయి డివైడర్ అంచులకు తల బలంగాతగిలింది. దీంతో రమేష్ అక్కడిక్కడే మృతి చెందాడు. మృతునికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఈ మేరకు పట్టణ ఎస్సై నరేష్ కేసు నమోద్ చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పామాయిల్ గెలలు



టన్ను ధర	రూ.13,741

మృత్యువును స్వాగతించారు..

- తల్లి, భార్య వారించినా బయట పార్టీకి వెళ్లి..
- కొత్త ఏడాది ప్రారంభంలోనే బైక్ అదుపుతప్పి ఇద్దరు యవకులు మృతి
- చెప్పినా వినలేదని బోరున విలపిస్తున్న రెండు కుటుంబాలు
- పదే పదే పోలీసులు ప్రచారం చేసినా ఆగని ప్రమాదం



పుల్లారావు (ఫైల్)



సాయి (ఫైల్)



రఘునాథపాలెం సెంటర్‌లో విగతజీవులుగా పడి ఉన్న పుల్లారావు, సాయి

రఘునాథపాలెం: నూతన సంవత్సర వేడుకల్లో జాగ్రత్తలు తీసుకోవాలని పదే పదే పోలీసులు అవగాహన కల్పించినా.. ఇంట్లో తల్లి ఎంతగా వారించినా.. ఫోన్‌లో భార్య ఎంత వేడుకున్నా.. వినకుండా బయట పార్టీకి వెళ్లారు. పాత సంవత్సరానికి వీడ్కోలు పలుకుతూ కొత్త ఏడాదికి స్వాగతం పలికిన తర్వాత మృత్యువును కూడా ఆహ్వానించారు. బైక్‌ను వేగంగా నడపడం వల్ల అదుపుతప్పి ఓ దుకాణంలోకి దూసుకుపోగా.. దానిపై ఉన్న ఇద్దరు యువకులు కిందపడి తలలకు గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. చిన్ననాటి నుంచే ప్రాణ స్నేహితులుగా ఉన్న వారిద్దరూ మృత్యువులోనూ బంధం వీడలేదు. నూతన సంవత్సరం ప్రారంభం రోజు ఎంతో ఆనందాన్ని నింపాల్సిన ఆ రెండు కుటుంబాల్లో తీరని విషాదం నెలకొంది. తాము చెప్పినట్లు విని ఉంటే ఇలా జరిగి ఉండేది కాదని ఆ యువకుల కుటుంబ సభ్యులు, బంధువులు రోదిస్తున్న తీరు అక్కడివారిని తీవ్రంగా కలచివేసింది. ఈ ఘటన రఘునాథపాలెం గ్రామంలో శనివారం అర్ధరాత్రి చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం ప్రకారం.. నగరంలోని పాండురంగాపురం గ్రామంలో పెయింటింగ్ కార్మికుడిగా పనిచేస్తున్న కట్ల పుల్లారావు (24), రఘునాథపాలెంలో నివాసం ఉండే, ఓ ప్రైవేట్ కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న (గతంలో ఇతను కూడా పెయింటింగ్ పనిచేసేవాడు) పందుల సాయి (25) ఇద్దరు స్నేహితులు. 2022 ఏడాది చివరి రోజు కాబట్టి తోటి స్నేహితులతో కలిసి పార్టీ చేసుకోవాలని నిర్ణయించుకున్నారు. బయటకు వెళ్లి పార్టీ చేసుకున్నారు. అనంతరం పుల్లారావు తన ద్విచక్రవాహనంపై సాయిని ఇంటి వద్ద దించేందుకు రఘునాథపాలెం చేరుకున్నాడు. సెంటర్‌లో వేగంగా బైక్ నడుపుతూ అదుపుతప్పి ఓ దుకాణం మెట్లను ఢీకొట్టాడు. దీంతో బైక్‌పై ఉన్న ఇద్దరు కిందపడ్డారు. వారి తలలకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతిచెందారు. విషయం తెలియగానే రఘునాథపాలెం ఎస్‌ఐ ఎం.రవి సిబ్బందితో అక్కడకు చేరుకుని మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించి కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఘటనా స్థలాన్ని ఖమ్మం రూరల్ ఏసీపీ బస్వారెడ్డి, సీఐ శ్రీనివాస్ సందర్శించారు.

పెళ్లి అయి ఏడాదే..

పుల్లారావుకు వెన్నెల అనే యువతితో ఏడాది కిందటే వివాహమైంది. ప్రస్తుతం ఆమె ఐదు నెలల గర్భిణి. గత నెల 29న వెన్నెల తన పుట్టింటికి వెళ్లింది. తన భర్త పార్టీకి వెళ్తున్నట్లు గ్రహించిన ఆమె తన అత్తకు ఫోన్ చేసి పార్టీకి వెళ్లకుండా ఆపాలని వేడుకుంది. పుల్లారావుకూ ఫోన్ ద్వారా చెప్పింది. అయినా పుల్లారావు తన తల్లి, భార్య మాట వినకుండా బయటకు వెళ్లి వారు సందేహించినట్లుగానే మృత్యువాడ పడి తీరని శోకాన్ని మిగిల్చాడు.

ఒక్క నిమిషమైతే..

ఇదే ప్రమాదంలో మరణించిన సాయి.. ఒక్క నిమిషమైతే ఇంటికి చేరుకునేవాడే. ఇంటికి అడుగుల దూరంలోనే ప్రమాదం జరిగి అతడు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. ఒక్క నిమిషం సవ్యంగా వచ్చి ఉంటే ఇంట్లోకి చేరుకునే వాడని అతడి కుటుంబ సభ్యులు విలపిస్తున్న తీరు అక్కడివారిని కంటతడి పెట్టించింది. కాగా, సాయి రెండేళ్ల కిందట ఓ యువతిని ప్రేమ వివాహం చేసుకున్నాడు. రెండు నెలల కిందట అతడికి పాప పుట్టింది.

యువత ఆలోచనలో మార్పు మారాలి..

డిసెంబర్ 31న మిత్రులతో కలిసి పార్టీలు చేసుకోవడం.. మద్యం మత్తులో అతివేగంగా వాహనాలపై రాకపోకలు సాగించడం.. లాంటివి చేయొద్దని పదే పదే ప్రచారం చేశాం. పోలీస్ శాఖ ఆధ్వర్యంలో సోషల్ మీడియా, పత్రికల ద్వారా అవగాహన కల్పించాం. ప్రధాన రోడ్ల వెంట భారీగా పెట్రోలింగ్ చేపట్టాం. అయినా ప్రమాదం జరగడం బాధాకరం. ఇలాంటి ఘటనలు చూసైనా యువత ఆలోచనలో మార్పు రావాలి. నియంత్రిత వేగంతో బైక్‌లు నడపటంతోపాటు హెల్మెట్ కచ్చితంగా ధరించాలి.

– శ్రీనివాస్, రూరల్ సీఐ

నలభై ఏళ్ల రాజకీయంలో ఎంతో అభివృద్ధి చేశా..

- ముగ్గురు సీఎంల వద్ద మంత్రిగా పనిచేశా..
- మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు



మాట్లాడుతున్న తుమ్మల నాగేశ్వరరావు

ఖమ్మంరూరల్: నలభై ఏళ్ల రాజకీయ జీవితంలో జిల్లా సర్వతోముఖాభివృద్ధికి కృషి చేసి, ఉమ్మడి ఖమ్మం జిల్లాను అభివృద్ధిలో అగ్రగామిగా నిలిపానని మాజీ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు అన్నారు. ఆదివారం మండలంలోని బారుగూడెం పరిధిలోని శ్రీసిటీలో జరిగిన నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. అనంతరం జరిగిన విలేకరుల సమావేశంలో తుమ్మల మాట్లాడుతూ.. ముగ్గురు సీఎంల వద్ద మంత్రిగా పనిచేశానని, జిల్లాకు అవసరమైన మౌలిక సదుపాయాలు కల్పించానని చెప్పారు. సంక్షేమ పథకాలు, అభివృద్ధి పనుల్లో ఖమ్మం జిల్లాను అగ్రగామిగా నిలిపానని, ప్రతీ గ్రామానికి బీటీ రహదారి సౌకర్యం, జాతీయ రహదారుల నిర్మాణం చేపట్టానని పేర్కొన్నారు. దుమ్ముగూడెం ప్రాజెక్ట్ నుంచి సీతారామ ద్వారా ఉమ్మడి జిల్లాలో 10 లక్షల ఎకరాలకు సాగునీరు అందించేందుకు ఎంతో కృషి చేశానని, గోదావరి జలాలతో పాలేరు ప్రజల పాదాలు కడుగుతానని పేర్కొన్నారు. గోదావరి జలలాతో కరువుసీమగా ఉన్న పాలేరు పచ్చని పొలాలతో కళకళలాడబోతోందని తెలిపారు. టీడీపీ, టీఆర్ఎస్ ప్రభుత్వాల్లో మంత్రిగా ఉండి నిబద్ధతతో కూడిన రాజకీయాలు చేస్తూ నీతి, నియమాలు అనుసరిస్తూ ప్రజావసరాల మేరకు చిన్న నీటి, మధ్య తరహా, భారీ ప్రాజెక్ట్‌ల నిర్మాణానికి అందరి సీఎంలను ఒప్పించానని వివరించారు. కాగా, బయట పార్టీ మారుతున్నట్లు జరుగుతున్న ప్రచారంపై విలేకరులు ప్రశ్నించగా.. ప్లీజ్ ఆ విషయంలో ఏమీ చెప్పేది లేదని అక్కడి నుంచి వెళ్లిపోయారు. సమావేశంలో బీఆర్ఎస్ జిల్లా నాయకులు సాధు రమేశ్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కారు, మోటార్‌సైకిల్ ఢీ..

బూర్గంపాడు: సారపాక సమీపంలోని పుష్కరవనం వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురు యువకులు తీవ్ర గాయాలయ్యాయి. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉంది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం పాల్వంచకు చెందిన సాయిదీక్షిత్, అజయ్, హేమంత్ అనే ముగ్గురు యువకులు మోటార్ సైకిల్‌పై భద్రాచలం వెళ్తున్నారు. సారపాక పుష్కరవనంకు సమీపంలో భద్రాచలం నుంచి వస్తున్న కారు, మోటార్‌సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఈ ఘటనలో మోటార్‌సైకిల్‌పై వస్తున్న ముగ్గురు యువకులు తీవ్ర గాయల పాలయ్యారు. అనంతరం క్షతగాత్రులను భద్రాచలంలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. వీరిలో ఒకరి పరిస్థితి విషమంగా ఉండటంతో హైదరాబాద్‌కు తరలించారు.

రెండో ఐటీ టవర్ నిర్మాణానికి టెండర్లు



ఖమ్మంలోని ప్రస్తుత ఐటీ టవర్

ఖమ్మంఅర్బన్: ఖమ్మంలో రెండో ఐటీ టవర్ నిర్మాణానికి ప్రభుత్వం రూ.18 కోట్లు మంజూరు చేయగా ఆన్‌లైన్ టెండర్ల ప్రక్రియ పూర్తయింది. జిల్లాలోని యువత ఉద్యోగాల కోసం హైదరాబాద్, బెంగళూరుతో పాటు విదేశాలకు వెళ్లకుండా స్థానికంగానే ఉద్యోగాలు కల్పించాలని లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రధాన నగరాల్లో టవర్లు నిర్మించి ఐటీ కంపెనీలను ప్రోత్సహిస్తోంది. ఇప్పటికే ఖమ్మంలో ఐటీ టవర్ మొదటి దశ నిర్మించి 19 కంపెనీలను తీసుకొచ్చారు. యువతకు ఉపాధి కల్పించడం కోసం మంత్రి పువ్వాడ అజయ్‌కుమార్ ప్రత్యేక దృష్టి పెట్టిన విషయం తెలిసిందే. అదనంగా మరికొన్ని కంపెనీలను తీసుకొచ్చి మరింత మంది యువతకు ఉద్యోగాలు కల్పించేందుకు ఏడాదిన్నర కిందట ఐటీ మంత్రి కేటీఆర్ ఖమ్మంలో రెండో టవర్ నిర్మాణం చేస్తామని బహిరంగసభలో ప్రకటించారు. ఆ మేరకు ప్రస్తుతం ఇల్లెందు క్రాస్ రోడ్డులోని కూరగాయల మార్కెట్ ప్రాంతంలో రెండో టవర్ నిర్మాణానికి స్థలం కేటాయించారు. కూరగాయల మార్కెట్‌ను వీడీఓస్ కాలనీలోని ఖమ్మం నగర ఏసీపీ కార్యాలయం పక్కకు తరలించనున్నారు.

బిడ్ల దాఖలుకు ముగిసిన గడువు

తెలంగాణ రాష్ట్ర పారిశ్రామిక మౌలిక సదుపాయాల సంస్థ ద్వారా రెండో ఐటీ టవర్ నిర్మాణానికి ఆన్‌లైన్ టెండర్లు పిలిచారు. గత నెల 22న టవర్ నిర్మాణం కోసం పేపర్ ప్రకటన జారీ చేశారు. 29న బిడ్ల దాఖలుకు చివరి తేదీగా టీఎస్ఐఐసీ లిమిటెడ్ ప్రకటించింది. దాఖలైన ఆన్‌లైన్ బిడ్లను తెరిచి వాటిలో అర్హత ఉన్న వారికి టెండర్లు ఇచ్చి రెండో టవర్ నిర్మాణానికి శంకుస్థాపన చేసేవిధంగా కసరత్తు చేస్తున్నారు.

ట్రాక్టర్ మీదపడి వ్యక్తి మృతి





తండ్రికి తలకొరివి పెడుతున్న కుమార్తె ప్రియాంక, (ఇన్‌సెట్) రామా మృతదేహం

కూసుమంచి: ట్రాక్టర్ అదుపుతప్పి మీద పడటంతో ఓ వ్యక్తి దుర్మరణం చెందాడు. ఈ ఘటన ఆదివారం మండలంలో చోటుచేసుకుంది. వివరాలిలా ఉన్నాయి.. బికారితండాకు చెందిన తేజావత్ రామా (48)కు ట్రాక్టర్ ఉంది. పక్క గ్రామమైన మందడినర్సయ్యగూడెంలో ఓ రైతు పొలంలో దమ్ము చేసేందుకు రామా తన ట్రాక్టర్ తీసుకెళ్లాడు. దమ్ము చేస్తుండగా ట్రాక్టర్ అదుపుతప్పి పల్టీ కొట్టి రామ మీద పడింది. దీంతో రామా అక్కడికక్కడే దుర్మరణం చెందాడు. అయితే, ట్రాక్టర్‌ను అదుపు చేసే క్రమంలో రైతు వెంకటరెడ్డి సైతం తీవ్రంగా గాయపడ్డారు. రామాకు భార్య, ఇద్దరు కుమార్తెలున్నారు. పెద్ద కుమార్తె ప్రియాంక తండ్రికి అంత్యక్రియలు నిర్వహించింది. పాలేరు ఎమ్మెల్యే కందాల ఉపేందర్ రెడ్డి, విజయలక్ష్మి దంపతులు రామా మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పూర్తిస్థాయి డీడీఓ అధికారాలు ఇవ్వాలి



మాట్లాడుతున్న వెంకటేశ్వరరావు

కొత్తగూడెంఅర్బన్: కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలల ప్రధానోపాధ్యాయులకు పూర్తిస్థాయి డీడీఓ అధికారాలు ఇవ్వాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు డి.వెంకటేశ్వరరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి రవి డిమాండ్ చేశారు. ఆదివారం కొత్తగూడెంలో జరిగిన సమావేశంలో వారు మాట్లాడారు. గిరిజన సంక్షేమశాఖ అధికారుల పదోన్నతులలో ఉపాధ్యాయులకు నిష్పత్తిని అమలుచేసి హెచ్‌డబ్ల్యూఓ పదోన్నతులు కల్పించాలన్నారు. గిరిజన విద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మక విద్య, పౌష్టికాహారం అందించాలని గొప్ప లక్ష్యంతో జీవో నెంబర్ 56 ద్వారా గిరిజన హాస్టల్స్‌ను కన్వర్టెడ్ ఆశ్రమ పాఠశాలలకు ఏర్పాటు చేశారని పేర్కొన్నారు. లక్ష్యాన్నిపూర్తిగా అమలు చేయుటకు డీడీఓ అధికారాలు ఇవ్వాలని, రెగ్యులర్ పోస్టులు మంజూరు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర బాధ్యులు డి.దేవసింగ్, ఆ.సైదులు, నరసయ్య, హెచ్‌ఎం రామచంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.